చేశాడు.''

''అతని సహకారం లేకుండా నువ్వు రాయలేవు?'' అడిగాడు రఘురాం. సునంద చెప్పింది.

''రాయలేక కేదు. నా కంటే వయసులోనూ అనుభవంలోనూ పెద్దవాడు. సలహా తీసుకుంటే మంచిదని''అదో సెంటిమెంటు అంతే.

''నువ్వు రాసే ప్రతీ కథా అతని సలహా సంప్రదింపులమీదే రాసేటట్లయితే నువ్వు కథలు రాయడం మానేయ్యటం మంచిది.'' అన్నాడు రఘురాం.

అతని భావం అర్థం అయింది సునందకి. అది బయట పెట్టకుండా కథల పైన వంక పెడుతున్నాడు.

''సారీ బహుశ నేను కథలు రాయడం మానలేక పోవచ్చు'' తను కథలు రాస్తూనే ఉంది, మానలేదు. అవి అచ్చవుతూనే ఉన్నాయి. డబ్బులు వచ్చినప్పుడల్లా అతను లెక్కలు అడుగుతూనే ఉన్నాడు. తను ఇస్తూనే ఉంది.

సత్యమూర్తి దగ్గర తనకి చనువుందనీ అతనితో కలసి పెళ్ళికి ముందు పత్రికాఫీసులకి, మీటింగులకీ వెళ్ళేదనీ తనే రఘురాంతో ఓసారి చెప్పింది. అది మనసులో ఉంచుకుని కాబోలు మరోసారి అడిగాడు.

''ఆ సత్యమూర్తితో స్నేహం మానలేదు?'' అని''మానటానికి గల కారణం కనిపించలేదు'' అంది తను ''నా కిష్టం లేదు అంతే. నేను లేనప్పుడు అతను ఇంటికి రావటం నిన్ను అతను మీ ఆఫీసులో కలుసుకోవడం నాకు నచ్చదు''

అతని మాటలు సిల్లీగా తోచాయి సునందకి.

''చూడండి నేనతనితో రహస్యంగా మాట్లాడాలని అనుకోవడంలేదు. అతనొచ్చిన సమయానికి వారింట్లో ఉండటం లేదంతే. ఉన్నప్పుడు కూడా మీరు ఊరికే చిరాకు పడిపోతూ అసహనంగా ఉంటారు. అది నాకెంతో చిన్నతనంగా ఉంటుంది. మీకు ఓపికా తీరికా ఉంటే మా సంభాషణల్లో పాలు పంచుకోడం నాకూ ఇష్టమే'' అంది.

అతని మనసులో ఏమనుకున్నాడో తెలీదుగానీ సత్యమూర్తితో అతను నవ్వుతూ సరదాగా మాట్లాడటం సునంద ఎప్పుడూ చూడలేదు. తన స్నేహితుల్ని పరిచయం చేసినప్పుడు, వాళ్ల తమ ఇంటికి వచ్చినప్పుడూ వాళ్లముందు తేలిగ్గా మాట్లాడటం, మొహం చిట్లించి చిరాకు ప్రదర్శించడం చేయటంతో వాళ్లని ఇంటికి పిలవడం మానేసింది సునంద.

''నువ్వు సుఖంగా ఉండటమే నాకు కావాల్సింది. మీ ఆయనికి ఇష్టం లేకపోతే నా స్నేహం మానెయ్. ఉత్తరాలుకూడా రాయొద్దు''అంటాడు సాగర్.

సాగర్‌కున్న సంస్కారంలో ఒక్కవంతు ఇతన్లో ఉన్నా ఎంత బాగుండేది అనుకుంది సునంద. సాగర్ తన అభిమాని. స్నేహితుడు, శ్రేయోభిలాషి. బెంగుళూరులో ఓ ఫాక్టరీలో ఇంజనీరుగా చేస్తున్నాడు. ఆఫీసు పనిమీద రెండు రోజుల క్రితం హైదరాబాదు వచ్చాడు. రఘురాం సంగతి తెలిసి అతన్ని ఇంటికి పిలిచి అగౌరవ పరచడం ఇష్టం లేక ఊరుకుంది సునంద. వెళ్లబోయేముందు సాయంత్రం తనని కలుసుకోవాలని ఆఫీసుకివచ్చాడు. ఇంటికి పిలిచి మర్యాదచేసి పంపించరాని తన పరిస్థితికి సిగ్గుగానూ,బాధగానూ ఉంది సునందకి.

సాగర్ హైదరాబాదు వచ్చిన సంగతి, తనతో మాట్లాడిన విషయం రహస్యంగా ఉంచాలని సునంద ఎప్పుడు అనుకోలేదు. అయితే తను సాగర్‌తో మాట్లాడటం రఘురాం చూశాడన్న మాట. రహస్యంగా తనని గమనించాల్సిన అవసరం అతనికేమొచ్చింది? అదే సునందకి అర్థం కాని విషయము బాధ కలిగించిన విషయమూ పైగా రఘురాం తనని ప్రశ్నించిన తీరు అతనేదో మనసులో పెట్టుకుని చేయని తప్పుకి తనని నిలేసి అడుగుతున్నట్టుగా ఉంది.

మంచమీద అశాంతిగా కదిలింది సునంద. నిద్ర పోవాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కళ్ళుమూసుకుని పడుకుని ఆలోచిస్తోంది. కొంచెంసేపటికి రఘురాం రేడియో కట్టేసి పక్కనే మంచంపైకి చేరాడు కళ్లనిప్పి చూసింది సునంద.

''ఇలా ఎంతకాలం తప్పించుకుంటావ్?''అడిగాడు రఘురాం.

అర్థం కాలేదు సునందకి. మానసికంగానూ శారీరకంగానూ పూర్తిగా అలిసిపోయి ఉంది. ఆతను తననెందుకలా మాటలతో వేధిస్తున్నాడో అసలతని ఉద్దేశ్యం ఏమిటో అంతుబట్టలేదు.

''చూడండి డొంక తిరుగుడు వద్దు. మీ మనసులో ఏముందో సూటిగా అడగండి. సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాను''అంది.

''ఆల్‌రైట్ అయితే చెప్పు. సాగర్‌తో నీదెలాంటి పరిచయం?''సునంద సూటిగా చూసింది రఘురాం మొహంలోకి.

''స్నేహం''చెప్పింది.

''ఎటువంటి స్నేహితుడు?''

''మంచివాడు, నాక్లోజ్ ఫ్రెండ్''

''ఐ.సీ.''ఏదో రహస్యం కనిపెట్టినవాడిలా అన్నాడు.

''ఎంతక్లోజ్ ఫ్రెండ్?''

రఘురాం అలా అడుగుతుంటే అసహ్యంగా చూసింది సునంద. స్నేహానికి అర్థం విలువ తెలిసి ఉంటే అతనలా మాట్లాడడనిపించింది. తన నోటిద్వారా అసలతను ఏం చెప్పించాలని



చూస్తున్నాడో అర్థం కాలేదు.

''ఎంత అంటే మా మధ్య రహస్యాలంటూ ఏమీ లేనంత. ఒక్క సెక్స్ విషయంలో తప్ప ఈ ప్రపంచంలో ఏ విషయం గురించైనా ఫ్రీగా మనసు విప్పి మాట్లడుకోగల చనువు మా ఇద్దరిమధ్య ఉంది''అంది.

రఘురాం అదోలా నవ్వేడు.

''అవున్లే రచయిత్రివి కదూ ఎన్ని కబుర్లయినా చెపుతావు''

సునంద మంచంపైన లేచి కూర్చుంది.

''ఏమిటి మీ ఉద్దేశం?''నిలదీసి అడిగింది.

''అసలు నీ ఉద్దేశం ఏమిటి చెప్పుముందు. సత్యమూర్తితోనూ, సుధాకర్‌తోనూ, శ్రీధర్‌తోనూ, మూర్తితోనూ, ఇలాంటి చనువే ఉందా నీకు?

ఆమాటతో రఘురాం ఏమిటో పూర్తిగా అర్థమై పోయింది సునందకి.

సునంద అతనికేసి చూసింది. ఆచూపులో ఏవగింపు ఉంది, రోషం ఉంది, అసహ్యం ఉంది జుగుప్స ఉంది. ఈ మనిషి తనభర్త అనుకుంటే భరించరానంత అవమానంగా ఉంది. ఇక అతనితో మాట్లడటం అనవసరం అనిపించింది.

''మాట్లాడవేం?'' రెట్టించాడు రఘురాం.

సునంద తలెత్తి అతని మొహంలోకి ఏవగింపుగా చూసి అంది.

''మీ అర్థంలేని అనుమానాలకి సంజాయిషీ ఇచ్చుకోవల్సిన అవసరం నాకు లేదు. అనవసరంగా గొడవలు పెంచి ఈ మాత్రం మనశ్శాంతి కూడా లేకుండా చెయ్యకండి. అంతే నేను చెప్పదల్చుకున్నది.''

రఘురాం విసురుగా మంచం పైన లేచి కూర్చున్నాడు.

''మనశ్శాంతి లేకుండా చేస్తున్నది నువ్వు. ఆఖరుసారిగా చెబుతున్నాను. ఇక నుంచీ నీ ఆటలు సాగటానికి వీల్లేదు. స్నేహం పేరుతో అడ్డమైన వాడితో పూసుకు తిరగటం నాకు నచ్చదు. ఏదో సోషల్‌గా ఉంటాడనుకున్నాను. అంతే గానీ ప్రతి మొగాడితో ఇలా బరితెగించి ప్రవర్తిస్తారని తెలిస్తే.... ''

సునందలో సహనం చచ్చిపోయింది. ఛీదరింపుగా అంది ''ఛీ కట్టుకున్న భార్యతో ఇలా మాట్లాడటానికి సిగ్గులేదూ?'' ఆ మాటతో రఘురాం రెచ్చిపోయాడు.

షటప్ అసలు పరువున్న ఆడదానివేనా నువ్వు? నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావో ఇప్పుడు అర్థమైంది. మొగుడంటూ ఎవడో ఒకడు ఉంటే వాడిచాటున ఎన్ని నాటకాలు ఆడినా ఎందరితో తిరిగినా ఎవరికీ తెలీదనేగా?''

''మళ్ళీఒకసారి ఆ మాట అన్నారంటే...''

''ఏం చేస్తావే అసలు నీతి ఉన్న ఆడదానివైతే నోరెత్తవు నువ్వెలాంటి దానివో తెలిసినా ఇంతకాలం... ''

''యూ...బాస్టర్డ్ నిన్నూ...''

మరుక్షణం రఘురాం దవడ పేలిపోయింది. అంత శక్తి సునంద చేతికెలా వచ్చిందో తెలదు. ఆ దెబ్బతో రఘురాం కళ్ళు బైర్లు కమ్మాయి. అబ్బా అంటూ చేత్తో చెంపని అదుముకున్నాడు. పళ్ళు కదిలి నట్లనిపించింది. బాధగా కళ్ళు మూసుకున్నాడో క్షణం. ఏం జరిగిందో తెలుసుకునే లోగా సునంద అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది. మెల్లగా కళ్ళిప్పిచూసిన రఘురాంకి ఆ గదిలో సునంద కనబడలేదు.

''సంస్కారం, అభిమానం, నీతి నీకు లేకపోవచ్చు కానీ నాకున్నాయి. ఇంత వరకు భర్త అన్న గౌరవంతో నీకు విలువ ఇచ్చాను. నీకు భార్య నెలా చూసుకోవాలో తెలీదు అసలు సివిలైజ్డ్ సొసైటీలో బతికే అర్హత నీకు లేదు. మగాడినన్న అహంకారంతో మృగంలా ప్రవర్తిస్తే భరిస్తూ బతికే ఖర్మ... ఆతర్వాత మాటలు వినబడలేదు. రఘురాం గదిబయటికి వచ్చాడు.

సునంద అప్పటికే సూట్‌కేస్‌లో బట్టలు కుక్కి దాన్ని చేతిలోకి తీసుకుంది. రఘురాం కేసి తలతిప్పి అయినా చూడ కుండా బయటికి నడిచింది. అప్పుడు రాత్రి పదకొండయింది. *